సాక్షి రంగారెడ్డి

సోమవారం । 7 । జూలై । 2025



భూములు కేటాయించండి

తమ భూములను కేటాయించాలని నర్సప్ప గూడ శివారులో టెక్స్‌టైల్ పార్క్ వద్ద సొసైటీ సభ్యులు ధర్నాకు దిగారు. 8లో▸



సిటీబస్సులకు సెలవ్!

సాధారణ రోజుల్లో అరకొరగా నడిచే సిటీబస్సులకు సెలవు రోజుల్లో అధికారులు మరింత కోత విధిస్తున్నారు. 8లో▸



అభివృద్ధి చేసుకోవాలి

గ్రామీణ ప్రాంతాల్లో కాలనీలు అభివృద్ధి చెందినప్పుడే పట్టణాలుగా రూపాంతరం చెందుతాయని మాజీ స్పీకర్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రకృతి మాతగా భూదేవి



కడ్తాల్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో ఆదివారం భూదేవికి ఔషధ మొక్కలతో ప్రకృతి మాతగా అలంకరించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతి, సంస్కృతి రెండే మన భవిష్యత్తు అని, వాటిని పరిరక్షించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సీజీఆర్ కోఆర్డినేటర్ రజనీకాంత్, సిబ్బంది ఉన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ సేవలు అందరికీ ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో ఆదివారం పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుమేరకు జిల్లాలో 75 వేల మొక్కలు నాటినట్టు తెలిపారు. స్థానిక సమరంలో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, తర్రె మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వండి



శివసేనారెడ్డిని కలిసిన వక్కలంక శ్రీనివాసరావు

హుడాకాంప్లెక్స్: సీనియర్ నాయకులకు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు కోరారు. స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ మారకుండా అంటిపెట్టుకుని ఉండి కష్టకాలంలో ఉన్నప్పుడు అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజాక్షేత్రంలో పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేయాలని అన్నారు. అతి తక్కువ సంఖ్యలో ఉన్న బ్రాహ్మణ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. దీనికి శివసేనారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట యువజన నాయకుడు స్వరూప్‌రాజు ఉన్నారు.

బహుజన బంధువు పండుగ సాయన్న

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పండుగ సాయన్న జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సామాజిక విప్లవకారుడు సాయన్న జయంతిని పురస్కరించుకొని ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని తెలంగాణ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సాయన్న.. బహుజన బంధువుగా పేరుగాంచాడని పేర్కొన్నారు. ఉన్నవారిని దోచి, పేదలకు పంచాడని తెలిపారు. సాయన్న జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇప్పటికీ ఆయనను రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో దేవుడిలా కొలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, హన్మంతు ముదిరాజ్, సంఘం గౌరవ అధ్యక్షుడు రాంచంద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: చెందిప్ప మరకత శివాలయానికి క్యూ కట్టిన భక్తులు

వైభవంగా తొలి ఏకాదశి

తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. దేవాలయాలను శోభాయమానంగా అలంకరించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో ఆలయాలను దర్శించుకున్నారు. ఇబ్బంది లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



ఆమనగల్లు: పీర్ల ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మొహర్రం వేడుకలను ఆదివారం జిల్లాలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వీధుల్లో డప్పు వాయిద్యాల మధ్య పీర్లను ఊరేగించారు. పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండం చుట్టూ తిరుగుతూ అలయ్ ఆడారు. చివరగా పీర్లను నిమజ్జనం చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రీ అంతంతే!

జిల్లాలో 30 శాతం మించని రిజిస్ట్రేషన్

- మున్సిపాలిటీలుగా మారిన జీపీలు
- కోడ్ మారడంతో తలెత్తుతున్న సమస్యలు
- ఫార్మా యాప్‌లో నమోదు కాని రైతుల వివరాలు
- తలలు పట్టుకుంటున్న వ్యవసాయశాఖ అధికారులు



యాచారంలో రిజిస్ట్రీ చేసుకుంటున్న రైతులు (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆధార్ తరహాలో రైతులకు భూధార్ కార్డులు జారీ చేసే (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రక్రియ జిల్లాలో మందకొడిగా సాగుతోంది. మెజార్టీ వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మారడం, నిన్న మొన్నటి వరకు గ్రామ పంచాయి తీలుగా ఉన్న రెవెన్యూలు.. మున్సిపాలిటీ/కార్పొరేషన్ల పరిధిలోకి వెళ్లడం, ఆయా గ్రామాల కోడ్ నంబర్లు మారడం, ఇతర ప్రాంతాలకు చెందిన వారు భూములు కొనుగోలు చేయడం, ఆధార్ అడ్రస్‌లో తేడాలు ఉండటం, తరచూ సర్వర్ డౌన్ అవుతుండటం, రైతులకు ఫోన్లు అందుబాటులో లేకపోవడం, ఒక వేళ ఉన్నా.. మెస్సేజ్ బాక్సుకు వచ్చిన ఓటీపీ చెప్పలేక పోతుండటం.. వెరసి జాప్యానికి కారణమవుతోంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బుల కోసమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే అపోహ రైతుల్లో ఉంది. నిజానికి పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి 50 శాతం మంది రైతులు మాత్రమే అర్హులుగా ఉన్నారు. వీరు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు ముందుకు రావడం లేదు. కొన్ని గ్రామాల్లో ఫామ్ ల్యాండ్ పేరుతో వెంచర్లు వెలిశాయి. అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి కూడా రైతులుగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయి. వీరు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఫార్మర్ రిజిస్ట్రేషన్లతో పాటు భూసార పరీక్షలు, పీఎం కిసాన్ నిధిలో అర్హులు జీవించి ఉన్నారా లేదా అనే క్షేత్రస్థాయి పరిశీలన, మరోవైపు వన మహోత్సవం వంటి కార్యక్రమాలు వ్యవసాయ విస్తరణ అధికారులను ఒత్తిడికి గురి చేస్తున్నాయి.

మచ్చుకు కొన్ని మండలాల్లో..

- కందుకూరులో 27,331 మందికి పట్టాదారు పాసుపుస్తకాలు ఉండగా, వీరిలో 4,732 మంది రైతుల వివరాలు మాత్రమే రిజిస్ట్రీ అయ్యాయి.
- మంచాలలో 18,700 మంది రైతులు ఉన్నారు. ప్రస్తుతం 1,600 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా రిజిస్ట్రేషన్ కొనసాగుతోంది.
- కేశంపేటలో 21,206 మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు 4,874 మంది (33.8శాతం) వివరాలు మాత్రమే నమోదయ్యాయి.
- యాచారంలో 19,093 మంది రైతులు ఉండగా, వీరిలో ఇప్పటి వరకు 2,583 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు.
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో 12 వేల మందికి కేవలం 800 మంది రైతుల పేర్లు నమోదయ్యాయి.
- ఇబ్రహీంపట్నంలో 19,000 మంది రైతులు ఉండగా, 800 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు.
- షాబాద్‌లో ఇప్పటి వరకు 30 శాతం మించలేదు. సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండంతో కొంత ఇబ్బంది ఏర్పడుతోంది.
- శంకర్‌పల్లిలో 25 శాతం మించలేదు. మొయినాబాద్‌లో 22 వేలపైగా రైతులు ఉండగా, మూడు శాతం మించలేదు.
- చేవెళ్ల 30 వేల మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు 10 శాతం రిజిస్ట్రీ అయింది.
- జిల్లెడు చౌదరిగూడలో 12,500 మంది రైతులకు 4,500 మంది మాత్రమే వివరాలు నమోదు చేసుకున్నారు.
- కొందుర్గులో 14,854 మంది రైతులకు కేవలం 3,671 మంది నమోదు చేసుకున్నారు.
- నందిగామలో 10,249 మందికి 1,692 మంది నమోదు చేసుకున్నారు.
- శంషాబాద్‌లో 14,938 మంది రైతులకు 2000 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు.
- కడ్తాల్ మండలంలో 14,623 మంది రైతులకు, 1,883 మంది రైతుల పేర్లు నమోదయ్యాయి.
- కొత్తూరులో 9,150 మందికి 1,650 మంది మాత్రమే పేర్లు నమోదు చేసుకున్నారు.

సమస్యలను అధిగమించాం

ఫార్మర్ రిజిస్ట్రీలో మొదట్లో పలు సాంకేతిక సమస్యలు తలెత్తిన మాట వాస్తవమే. ప్రస్తుతం వాటిని అధిగమించాం. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పర్యటించి, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఫార్మ్ యాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు భూధార్ కార్డు జారీ కానుంది. ఇది నిరంతర ప్రక్రియ.

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రాజ్యాధికార సాధనకు సమష్టి కృషి

షాబాద్: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ముందుకు సాగాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రేగడిదోస్వాడలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్‌చారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సత్యనారాయణ చారి, ఉపాధ్యక్షుడిగా కురుమ శ్రీశైలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను చైతన్యం చేసి గ్రామస్థాయి నుంచి బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించి హక్కులను సాధించునేందుకు కృషి చేయాలన్నారు. పేద విద్యార్థులకు సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు ఉన్నాయంటే ఆర్.కృష్ణయ్య కృషితోనే సాధ్యమైందని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు జలజ, అజయ్‌కుమార్, మధుసూదన్, రాఘవేందర్, మహేందర్, జయ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను మరవొద్దు



చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: మహనీయుల సేవలను మరిచిపోవద్దని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మండలకేంద్రంలో ఆదివారం ఆయన చిత్రపటానికి, బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిలో భాగంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహనీయులు చూపించిన మార్గంలో నడవాలని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, మున్సిపల్ అధ్యక్షుడు ఎ.అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. హిమాయత్‌నగర్ చౌరస్తా లోని విజయ్‌ఠాగూర్ గార్డెన్‌లో ఆదివారం లక్ష్య సాధన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రజ్ఞరాజు ఆధ్వర్యంలో బంగారు పుష్పాలతో పాదపూజ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, దేవనాథ జీయర్ స్వామి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వాలు పని చేయాలని అన్నారు. అనాథ పిల్లల కోసం లక్ష్య సాధన ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెనివెల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, యోగా బృందం సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

షాద్‌నగర్‌రూరల్: వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండకాంతయ్య అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రెండు రోజులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘం జిల్లా మహాసభలు ఆదివారంతో ముగిశాయి. సమావేశాల్లో వ్యయసాయ కార్మికులకు సంబంధించి పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కలకొండ కాంతయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా బుద్దుల జంగయ్యకు తిరిగి అవకాశం కల్పించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా పాలమాకుల జంగయ్య, శ్రీశైలంయాదవ్, వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా రమేష్‌యాదవ్, స్వరూప, కోశాధికారిగా కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాములు, రాజునాయక్, లింగమయ్య, యాదయ్య, చంద్రయ్య, బాల కృష్ణయ్య, యశోద, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల మద్దతుతోనే వర్గీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

షాద్‌నగర్‌రూరల్: అన్ని వర్గాలు, కులాలు మద్దతు ఇవ్వడంతోనే వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాదిగల కోసమే ప్రారంభించినా అన్ని వర్గాల సంక్షేమంకోసం పోరాడిందని గుర్తు చేశారు. గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత ఆపరేషన్‌కోసం, ఆరోగ్యశ్రీ పథకంకోసం దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్ల రిజర్వేషన్ల కోసం, తెలంగాణ అమరుల కుటుంబాల సంక్షేమం, మహిళలపై అత్యాచారాలు అరికట్టడానికి ఫాస్టాగ్ కోర్టులు ఏర్పాటు చేయాలని పాలకులపై పోరాడి విజయం సాధించుకున్నామని వివరించారు. ఆవిర్భావ సభలను గ్రామాగ్రామాన నిర్వహించి వాడవాడలా దండోర జెండాను ఎగరవేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు నాగభూషణం, సత్యం, వెంకటేశ్, ఎర్రోళ్ల సురేష్, లింగం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లాటరీకి రెడీ

- ఫార్మా ప్లాట్లకు నేడు ప్రక్రియ ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- లిస్టులో నకిలీల పేర్లు రాకుండా జాగ్రత్తలు



కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో టీజీఐఐసీ మెగా వెంచర్

యాచారం: ఫార్మా ప్లాట్లకు సోమవారం లాటరీ తీసే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. లిస్టులో నకిలీల పేర్లు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తమ పేర్లు ఉంటాయా.. లేదా అని నకిలీల గుండెల్లో దడ మొదలైంది. అప్పట్లో పరిహారంతో పాటు భూములు కోల్పోయిన రైతులకు ఎకరాలకు 121 గజాల ప్లాట్లను ఇచ్చారు. మొదట్లో అసైన్డ్ పట్టాదారులకు తమ పాసుపుస్తకాల్లో ఉన్న ఎకరాలకు మొత్తం భూమికి పరిహారం ఇవ్వకుండా సాగు యోగ్యమైన భూమికి మాత్రమే అందజేశారు. అలా అసైన్డ్‌దారుల పట్టా, పాసుపుస్తకాల్లో మిగిలిన ఎకరాల భూమిపై నకిలీలు కన్నేశారు. అధికారుల అండదండలతో మిగులు భూమిని కాజేశారు. మండలంలోని నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల్లో దాదాపు 250 నుంచి 500 ఎకరాలకు పైగానే నకిలీలు పరిహారం పొందినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

తొలిరోజు 60 గజాల ప్లాట్లు ఇలా..

గ్రామం	లబ్ధిదారులు
నక్కర్తమేడిపల్లి	255
కుర్మిద్ద	131
తాడిపర్తి	65
నానక్‌నగర్	91
ముచ్చర్ల	53
మీర్‌ఖాన్‌పేట	52
పంజగూడ	23
మొత్తం	670

నకిలీ పేర్లపై జాగ్రత్తలు

ఫార్మాసిటీలో నకిలీలు పెద్ద ఎత్తున పరిహారం పొందింది. ప్లాట్ల సర్టిఫికెట్లు పొందినట్లు అధికార పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న పెద్దలు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. సీఎంఓ ఉన్నతాధికారుల ఆదేశాలతో కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి అలర్ట్ అయ్యారు. లాటరీ లిస్టును వడబోస్తూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఫైనల్ చేస్తున్నారు. నకిలీల పేర్లు ఒక్కటి కూడా లిస్టుల్లో రావద్దని చూస్తున్నారు. అందుకే ముందు 60 గజాలు, రెండో రోజు 121 గజాలు, మూడో రోజు 181 గజాలు, నాలుగో రోజు మిగితా ప్లాట్లకు లాటరీ తీసి కబ్జా చూపించే విధంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. లాటరీలో పేర్లు ప్రకటించే ఫైనల్ లిస్టును సైతం పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రకటిస్తున్నారు.


రైతులు సహకరించాలి



ఫార్మాసిటీకి భూమిని సేకరించిన గ్రామాల్లో నకిలీల పేర్లతో పరిహారం పొందిన రైతుల పేర్లను గుర్తించాం. లాటరీ లిస్టును వడబోసి ఫైనల్ చేస్తున్నాం. ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్లు పొందిన నకిలీలను రద్దు చేస్తాం. అక్రమంగా పొందిన పరిహారాన్ని రికవరీ చేస్తాం. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. లాటరీ పద్ధతికి రైతులు సహకరించాలి.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ ఇబ్రహీంపట్నం

సజావుగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: రైతులకు ఫార్మా ప్లాట్ల పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఆదివారం భూనిర్వాసితులకు కేటాయించనున్న ప్లాట్ల గురించి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ డ్రాను ప్రారంభిస్తారన్నారు. సకాలంలో రైతులు వచ్చేలా చూడాలన్నారు. డ్రా కోసం వచ్చే రైతులకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులు ఆధార్, పాన్ కార్డు జిరాక్స్, ప్లాట్ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, అయ్యప్ప పాల్గొన్నారు.

మాకు భూములు కేటాయించండి

టెక్స్‌టైల్ పార్క్ ఎదుట సొసైటీ సభ్యుల ఆందోళన



టెక్స్‌టైల్ పార్క్ ఎదుట ఆందోళన చేస్తున్న సొసైటీ సభ్యులు

నందిగామ: తమకు తెలియకుండా కొంతమంది డైరెక్టర్లు భూములను విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్క్ సొసైటీలోని సభ్యులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములను కేటాయించాలని మండల పరిధిలోని నర్సప్పగూడ శివారులో టెక్స్‌టైల్ పార్క్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. 2002–03 సంవత్సరంలో హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పేరుతో సొసైటీని ఏర్పాటు చేశామన్నారు. అందులో 108 మంది సభ్యులు 8 మంది డైరెక్టర్లు ఉన్నారన్నారు. సొసైటీ పేరుతో నందిగామ మండలంలోని నర్సప్పగూడ శివారులో 143 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు చెప్పారు. అందరికీ పెట్టుబడులకు అనుగుణంగా గజాల చొప్పున కేటాయించారని, కానీ తమ పేరున పట్టాలు చేయలేదన్నారు. సొసైటీ పేరుతో కొంతమంది డైరెక్టర్లు తమకు తెలియకుండా కేంద్ర ప్రభుత్వం వద్ద సుమారు రూ.12 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వద్ద సుమారు రూ.కోటి రుణంగా తీసుకున్నారన్నారు. దాంతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం కొంతమంది డైరెక్టర్లకు కేటాయించిన స్థలంలో షెడ్లు నిర్మించి, మిగతా వదిలేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణానికి సంబంధించి వాయిదాలు చెల్లించే సమయం ఆసన్నం కావడంతో డైరెక్టర్లు చేతులెత్తేశారని ఆరోపించారు. దాంతో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు 2012లోనే రద్దు అయ్యిందని వివరించారు. నాటి నుంచి నేటి వరకు కొంతమంది ఆ భూమిని తమకు తెలియకుండా అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తాము కష్టపడి సంపాదించిన డబ్బుతో కొన్న భూమిని సొసైటీ పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ భూములు కేటాయిస్తే పరిశ్రమలు ఏర్పాటు చేయడమే కాకుండా స్థానికులకు ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రమేష్, రవి, పురుషోత్తం, రాజేష్, వెంకటరమణ, నాగమూర్తి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా అనుమతి లేకుండా టెక్స్‌టైల్ పార్క్‌లోకి ఎలా వెళ్తారనే ఫిర్యాదుపై నందిగామ పోలీసులు సొసైటీ సభ్యులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఫాంహౌస్‌కు వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి

మొయినాబాద్: స్నేహితులతో కలిసి పార్టీ చేసుకోవడానికి ఫాంహౌస్‌కు వచ్చిన ఓ వ్యక్తి గుండె పోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అంబర్‌పేట్ ప్రాంతానికి చెందిన తిరుమలరెడ్డి భువన మోహన్(50) శనివారం సాయంత్రం తన స్నేహితులు ఆరు మందితో కలిసి వెంకటాపూర్‌లోని ఆర్చిడ్ మలగా ఫాం హౌస్‌లో పార్టీ చేసుకోవడానికి వచ్చారు. రాత్రి ఫాంహౌస్‌లోనే ఉన్నారు. ఆదివారం ఉదయం భువన మోహన్‌కు చాతిలో నొప్పి రావడంతో వెంటనే చికిత్స కోసం స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



సునీత (ఫైల్)

మొయినాబాద్: డ్యూటీకి వెళ్లిన భర్త తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌కు చెందిన కొర్ర శివనాయక్ ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. జూన్ 29న శివనాయక్ డ్యూటీకి వెళ్లడంతో అతని భార్య సునీత(35) ఇంట్లోనే ఉంది. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఆయన ఇంటికి వచ్చాడు. భార్య ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికాడు. బంధువుల ఇంటికి వెళ్లిందేమోనని భావించాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సెలవొస్తే సిటీ బస్సులకు సెలవ్!

భారీగా ట్రిప్పుల రద్దు

- బస్టాపుల్లోనే జనం పడిగాపులు
- శివారు కాలనీల ప్రయాణికులు విలవిల
- రాత్రి 8 దాటితే ఇల్లు చేరడం కష్టమే...

ఆదివారం సాయంత్రం నాలుగు గంటలు. ఘట్కేసర్ సమీపంలోని అన్నోజిగూడ బస్టాపు. రాజు అప్పటికి ఓ గంట నుంచి బస్సు కోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. చివరకు ఐదున్నర గంటలకు ఓ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి వచ్చింది. బస్సెక్కడం అతనికి పెద్దసవాల్‌గా మారింది. ...ఒక్క రాజు మాత్రమే కాదు. పోచారం బస్టాపులో చాలాసేపటి నుంచి పడిగాపులు కాస్తున్న మరికొంత మంది ప్రయాణికులు సైతం మరో బస్సు ఎప్పటికొస్తుందో తెలియని అనిశ్చితి కారణంగా ఆ కిక్కిరిసిన బస్సునే ఆశ్రయించారు. రాంపల్లి, ఘట్కేసర్, ఎదులాబాద్, కొర్రెముల, అంకుషాపూర్, చౌదరిగూడ, ప్రతాప్‌సింగారం, తదితర వందలాది కాలనీలకు చెందిన ప్రయాణికులు శని, ఆదివారాలు, ఇతర సెలవురోజుల్లో సిటీ బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగరం నలువైపులా ఔటర్‌రింగ్‌రోడ్డుకు చుట్టుపక్కల ఉన్న కాలనీలు, గ్రామాలకు బస్సులు అందుబాటులో ఉండడం లేదు. సాధారణ పనిదినాల్లోనే అరకొరగా నడిచే బస్సులకు సెలవు రోజుల్లో అధికారులు మరింత కోత విధిస్తున్నారు. దీంతో శివారు కాలనీలకు చెందిన ప్రజలు నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్యాబ్‌లు, సెవెన్ సీటర్, త్రీ సీటర్ ఆటోలపైన ఆధారపడాల్సి వస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో

రెండు, మూడు గంటల నిరీక్షణ

సెలవు రోజుల్లో సిటీ బస్సులు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో కనీసం అరగంటకో బస్సు చొప్పున నడిచే రద్దీ రూట్లలో రెండు, మూడు గంటలు గడిచినా బస్సులు అందుబాటులో ఉండడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెలవు దినాల్లో ప్రయాణికుల రాకపోకలు తక్కువగా ఉంటాయనే కారణాన్ని సాకుగా చూపుతూ అధికారులు భారీగా ట్రిప్పుల్లో కోత విధిస్తున్నారు.



సాధారణ రోజుల్లోనే ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు నడపడం లేదు. సెలవురోజుల్లో ఈ కొరత మరింత తీవ్రంగా మారుతుంది. సాధారణంగా రోజుకు 10 ట్రిప్పులు నడిచే రూట్లలో సెలవు రోజుల్లో కనీసం 5 ట్రిప్పులు కూడా బస్సులు తిరగడం లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. సికింద్రాబాద్ నుంచి ఈసీఐఎల్, కుషాయిగూడ, సైనిక్‌పురి,నేరేడ్‌మెట్, సఫిల్‌గూడ, మల్కాజిగిరి తదితర ప్రాంతాలకు ప్రతి 15 నిమిషాల నుంచి అరగంటకు ఒకటి చొప్పున బస్సులు అందుబాటులో ఉంటాయి. కానీ సెలవొస్తే గంట గడిచినా బస్సు లభించడం లేదని, దీంతో ఆటోల్లో వెళ్లవలసి వస్తుందని మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన సుమ తెలిపారు. 'సెలవు రోజుల్లో జనమంతా ఇళ్లకే పరిమితమవుతారనే ఆలోచన ఏ మాత్రం సరైంది కాదు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పనివిధానం భిన్నంగా ఉంటుంది కదా.' అని ఆమె విస్మయం వ్యక్తం చేశారు. షాపింగ్ కోసం, ఇతర అవసరాల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాలనుకున్నా బస్సులు ఉండడం లేదని పేర్కొన్నారు. మరోవైపు ప్రయాణికుల రద్దీ భారీగా ఉండే సికింద్రాబాద్–పటాన్‌చెరు. కోఠి–లింగంపల్లి, ఉప్పల్–మెహదీపట్నం, కొండాపూర్–ఉప్పల్, జీడిమెట్ల–సీబీఎస్, సికింద్రాబాద్–కోఠి, సికింద్రాబాద్–అఫ్జల్‌గంజ్ వంటి ప్రధాన రూట్లలో కూడా ఆది వారాలు, ఇతర సెలవు రోజుల్లో ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో ఉండడం లేదు.

రాత్రిపూట ఇల్లు చేరేదెలా

ఈ బస్సుల కొరత కారణంగా వ్యాపార,వాణిజ్యసంస్థలు, షాపింగ్ సెంటర్‌లు, కిరాణా షాపులు, వస్త్రదుకాణాలు వంటి వివిధ చోట్ల పనిచేసే ఉద్యోగులు రాత్రిపూట ఇళ్లకు చేరడం కష్టంగా మారింది. 'విధులు ముగించుకొని రాత్రి 8 గంటలకు బస్టాపు వద్దకు వస్తే ఒక్క బస్సు కూడా కనిపించడం లేదు. ఆ రాత్రి బస్సు కోసం ఎదురుచూడలేక ఆటోల్లో వెళ్లవలసి వస్తుంది' అని సికింద్రాబాద్ నుంచి ప్రతి రోజు జగద్గిరిగుట్టకు రాకపోకలు సాగించే శ్రీలక్ష్మి చెప్పారు. చివరకు షేర్ ఆటోల్లో వెళ్లవలసి వస్తుందని, రాత్రిపూట ఆటోలను నమ్ముకొని ప్రయాణం చేయడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా నగరంలోని ప్రధాన వాణిజ్య, వ్యాపార కేంద్రాల నుంచి శివారు ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు వెళ్లే ప్రయాణికులకు రాత్రిపూట బస్సులు అందుబాటులో లేకపోవడం చాలా ఇబ్బందిగా మారింది. ఒకప్పుడు ప్రయాణికులు ఉన్నా లేకున్నా సమయానికి బస్సు మాత్రం వస్తుందనే భరోసా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

'నిజానికి వారం రోజుల పాటు ఉద్యోగాలకే పరిమితమైన వాళ్లకు ఆ ఒక్క రోజే కాస్త ఊరట ఉంటుంది. ఇంటిల్లిపాది కలిసి బయటకు వెళ్లాలనుకుంటే బస్సులు మాత్రం అందుబాటులో ఉండవు' అని మల్కాజిగిరికి చెందిన సంపత్ ఆరోపించారు. ఆర్టీసీ లెక్కల ప్రకారం నగరంలోని 1050 రూట్లలో 2850 సిటీ బస్సులు తిరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఈ రూట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజుకు సుమారు 16 వేల ట్రిప్పులు తిరుగుతున్నట్లు అంచనా. కానీ సెలవు రోజుల్లో కనీసం 5 వేల ట్రిప్పులకు పైగా రద్దవుతున్నాయి.

అత్తగారింటికి వెళ్తూ.. మృత్యు ఒడికి

బైక్‌ను డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: ఎదురుగా వస్తున్న బైక్‌ను డీసీఎం ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బీవీరావునగర్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుశీల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దాయపల్లి గ్రామానికి చెందిన విష్ణు(36) తన బైక్‌పై అత్తగారి ఊరైన వెల్జర్లకు బయలుదేరాడు. ద్విచక్రవాహనం బీవీరావునగర్ సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుశీల ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుకు గేదె మృతి



యాచారం: పాము కాటుకు గురై ఒక పాడి గేదె మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గుడ్ల జంగయ్య రోజు మాదిరిగానే శనివారం రాత్రి తన పాడి గేదెలను వ్యవసాయ పొలం వద్ద చెట్లకు కట్టేసి వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున వెళ్లి చూసే సరికి రూ.90 వేలకు పైగా విలువ చేసే పాడి గేదె మృతి చెందింది. కాళ్లకు కాట్లు ఉండడంతో పాము కాటు వేయడంతోనే గేదె మృతి చెందిందని గ్రామస్తులు గుర్తించారు.

తాటి చెట్లను రీప్లాంట్ చేయాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పోచారం: గీత కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న తాటి చెట్లను నరికి పాడు చేయకుండా ఇతర ప్రాంతాల్లో రీ ప్లాంట్ చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్‌లో సర్వే నెంబర్లు 311, 312, 313, 324, 326పార్టు, 327పార్టులో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ చేస్తూ తాటిచెట్లు, ఈత చెట్లను తొలగిస్తున్నందుకు నిరసనగా గీత కార్మికులు ఆదివారం ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్ కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాటిచెట్లపై నుండి కిందపడి చనిపోయిన వారు ఎంతో మంది ఉన్నారని, అయినా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయన్నారు. ఆరోగ్యమైన నీరా కావాలంటే తాటి చెట్లను తప్పనిసరిగా పెంచాలన్నారు. వందేళ్ల నాటి చెట్లను పది నిమిషాల్లో నేలమట్టం చేయడం దారుణమన్నారు. చెట్లను నకరడమంటే గీత కార్మికుల గుండెలపై తన్నినట్లన్నారు. గీత కార్మిక సంఘ రాష్ట్ర నాయకుడు పంజాల జైహింద్ గౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో వెంచర్ల మాటున తాటి చెట్లను తొలగించవద్దన్నారు. 300 పైగా కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడి బతుకుతున్నాయన్నారు. కార్మికులకు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే వెంచర్‌లో పనులు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘ నాయకులు కట్ట దర్శన్, భిక్షపతి, వెంకటేశ్, పాండు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి యువకుడి మృతి

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీలో సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..హైదరాబాద్, లింగంపల్లికి చెందిన మచ్చూరి అనిల్‌కుమార్(26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. నలుగురితో కలిసి అతను శనివారం వైజాక్ కాలనీని సందర్శించేందుకు వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున స్నానం చేసేందుకు సాగర్ వెనుక జలాల్లోకి దిగి నీట మునిగి గల్లంతయ్యాడు. గాలింపు చేపట్టిన పోలీసులు అనిల్ కుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాహుల్ గాంధీపై అసత్య ప్రచారాలు మానుకోండి

అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు

గన్‌ఫౌండ్రీ: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై దుష్ప్రచారం చేస్తున్న బీజేపీ ఐటీ విభాగంపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ ఐటీ విభాగం ప్రతినిధి రతన్‌రంజన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఒక పార్లమెంట్ సభ్యుడిని అగౌరపరచడమే కాకుండా మహిళల సాధికారత, గౌరవంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బీహార్ ఎన్నికల్లో భాగంగా గ్రామీణ ప్రాంతంలో నివసించే పేద మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం కోసం శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేశారన్నారు. మహిళలను కించపరుస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీకి దేశవ్యాప్తంగా ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ ఇటువంటి దుష్ప్రచారానికి పూనుకుందన్నారు. కార్యక్రమంలో శక్తి సూపర్ షీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కె.విద్యారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దీపక్, ప్రగ్యా, , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్‌ఛరణ్, వి.సురేష్, వై.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీలను అభివృద్ధి చేసుకోవాలి



మాజీ స్పీకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో కాలనీలు అభివృద్ధి చెందినప్పుడే పట్టణాలుగా రూపాంతరం చెందుతాయని మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ సమీపంలో గల పద్మావతి కాలనీ అధ్యక్షుడు జనార్దన్‌రావు మాజీ స్పీకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు మున్సిపాలిటీలో కలవడం మంచిదన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు మల్లేష్‌యాదవ్, రవియాదవ్, కాశిదాస్, గిరి, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: రెండు రోజుల క్రితం అదృశ్యమైన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని పిల్లోనిగూడ దుబ్బచర్ల బాల్‌రాజ్(45) సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఇతనికి భార్య కల్పన, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబ కలహాలతో గత కొన్నేళ్ల నుంచి భార్య, తన కొడుకులతో కలిసి ఇబ్రహీంపట్నంలోని తల్లిగారింటి వద్ద ఉంటుంది. బాల్‌రాజ్ గ్రామంలో తల్లి యాదమ్మతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిన బాల్‌రాజ్ తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం గ్రామ శివారులోని జూకల్ రోడ్డు పక్కన కల్వర్టు వద్ద చెట్ల పొదల్లో చనిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పటిదాకా ఆనందం.. అంతలోనే విషాదం

- రోడ్డు దాటుతుండగా ఓ కుటుంబాన్ని ఢీకొట్టిన కంటైనర్
- భర్త దుర్మరణం, భార్యాపిల్లలకు తీవ్ర గాయాలు



శ్రీనివాస్ మృతదేహం వద్ద బంధువుల రోదనలు

అబ్దుల్లాపూర్‌మెట్: బంధువులతో కలిసి అప్పటిదాకా ఆనందంగా గడిపిన ఓ కుటుంబం కొన్ని నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోపే రోడ్డు ప్రమాదం వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది. దంపతులు పిల్లలతో కలిసి రోడ్డు దాటుతుండగా కంటైనర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా, భార్య, ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంచపు శ్రీనివాస్(48) తన భార్య లక్ష్మి, కూతురు రాజేశ్వరీ, కుమారుడు రాంబాబుతో కలిసి మండల పరిధిలోని ఇనాంగూడ యశోదానగర్ కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం తన కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి కీసరకు వెళ్లిన శ్రీనివాస్ సాయంత్రం తిరుగు పయణమయ్యారు. బంధువుల కారులో మార్గమధ్యలో అబ్దుల్లాపూర్‌మెట్ విజయవాడ జాతీయ రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద దిగారు. రోడ్డు దాటుతుండగా అదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి అతి వేగంగా వచ్చిన కంటైనర్ నలుగురిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, అతని భార్య లక్ష్మి, కూతురు రాజేశ్వరి, కుమారుడు రాంబాబులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతున్న లక్ష్మి పరిస్థితి విషమంగా ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాస్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మరో ఐదు నిమిషాలైతే ఇంటికి చేరుకునే వారిని, అంతలోనే ఇలా జరిగిందని బంధువులు విలపిస్తున్నారు.

ఇంజనీరింగ్ 'అడ్మిషన్ల' కోసం గాలం..!

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల ఫోన్ల తాకిడిఒకవైపు కన్సల్టెన్సీ ఏజెన్సీలు.మరోవైపు ప్రైవేట్ డీమ్డ్ వర్సిటీలుతక్కువ ఫీజు ప్యాకేజీతో సీటు, హస్టల్ వసతివిద్యార్థుల తల్లిదండ్రుల అయోమయం

హలో సార్ గుడ్ మార్నింగ్... మీరు అక్షయ్ పేరెంటేనా? అక్షయ్‌కు ఎంత ర్యాంకు వచ్చింది?ఏ కోర్సు కోసం ప్లాన్ చేశారు. కన్వీనర్ కోటాలో ఆ కోర్సు సీటు కష్టమే కదా..? బీ కేటగిరి మేనేజ్‌మెంట్ కోటా కింద వెళ్లకండి. డబ్బులు వృథా చేయవద్దు. మా కాలేజీలో తక్కువ ఫీజులో అదే కోర్సు పూర్తి చేయవచ్చు. ఒకసారి మా కాలేజీ క్యాంపస్‌ను విజిట్ చేయండి. ఆలస్యం చేయకండి. ఎప్పుడు వస్తారు? రేపు బాబుతో కలిసి వస్తారా? వచ్చేటప్పుడు నా నెంబర్‌కు కాల్ చేయండి సార్.



సార్, నమస్తే... మాది ఫలనా ఎడ్యుకేషన్ అకాడమీ. మీరు విజయ్ ఫాదరేనా? బీటెక్‌లో ఏ కోర్సు ప్లాన్ చేశారు. గుజరాత్ టాప్ వన్ ఇంజనీరింగ్ కాలేజీ ఉంది. విశాలమైన స్థలం. హాస్టల్ వసతి, తక్కువ ఫీజు, స్కాలర్ షిప్, కోర్సు పూర్తయి తర్వాత మంచి ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ గ్యారంటీ. ఇప్పటికే 30 మందికి అడ్మిషన్లు ఇప్పించాం. కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి. ఆసక్తి ఉంటే ఆలస్యం చేయకండి. ఆలోచించి సంప్రదించండి.

సాక్షి,సిటీబ్యూరో: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల టెన్షన్ పెరిగిపోతోంది. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కూడా పూర్తి కావస్తోంది.ఏ ర్యాంక్ వరకు ఏ కాలేజీలో సీటు వస్తోందన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. గత విద్యా సంవత్సరం వచ్చిన ర్యాంకులను బట్టి అంచనా వేస్తున్నారు. టాప్ 10 నుంచి 20 కాలేజీల్లో సీటు ఆశలు సన్నగిల్లుతున్నాయి. వివిధ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు, కన్సల్టెన్సీలు నుంచి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ల తాకిడి పెరిగింది. మరోవైపు డీమ్డ్ వర్సిటీల నుంచి వాట్సాప్, ఎస్ఎంఎస్ మేసేజ్‌లు విపరీంగా పెరిగిపోతున్నాయి. రోజు వారీగా కనీసం 20 నుంచి 30 నుంచి ఫోన్లు వస్తుండటంతో ర్యాంకులు ఎక్కువ వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. స్థానిక కాలేజీలో తమ పిల్లలకు వచ్చిన ర్యాంకుల బట్టి సీటు వస్తుందా? వారి భవిష్యతేంటని ఆందోళన చెందుతున్నారు.

సీఎస్ఈ కోర్సుకు డిమాండ్

మహానగర పరిధిలోని టాప్ 20 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కోర్సుకు డిమాండ్ బాగా పెరిగింది. సీటు కోసం ఎంత ఫీజు అయినా చెల్లించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా సీట్లు లేకపోవడంతో, మేనేజ్‌మెంట్‌లు సొమ్ము చేసుకుంటున్నాయి.అయితే మేనేజ్‌మెంట్ కోటాలో సైతం కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సుల సీట్లకే పోటీ విపరీతంగా కనిపిస్తోంది. వాస్తవంగా మొత్తం సీట్లలో 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేసుకునే అవకాశం ఉంది. ర్యాంక్ ఆధారంగా కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద సీట్లను నింపి మిగితా సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. సీఎస్ఈ అనుబంధ కోర్సుల్లోని సీట్లు టాప్ కాలేజీలలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు, సెంకడరీ కాలేజీల్లోనూ రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల దాకా తీసుకుంటున్నారు.

డీమ్డ్‌వర్సిటీల తాకిడి..

ప్రై వేటు డీమ్డ్ వర్సిటీలు ఇంజనీరంగ్(బీటెక్) కోర్సులో అడ్మిషన్ల కోసం పోటీపడుతున్నాయి. తమ పీఆర్‌ఓలు, కన్సల్టింగ్ ఏజెన్సీల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో ఫోన్ల, వాట్సాప్, సందేశాల తాకిడి పెరిగింది.ఇప్పటికి వర్సిటీలు ప్రవేశాల కోసం అడ్మిషన్ ప్రకటనలు విడుదల చేసి కోర్సులు, ఫీజులు, ప్లేస్‌మెంట్ అవకాశాలు వంటి వివరాలతో పాటు వర్సిటీ ప్రాంగణం, సౌకర్యాలు, ల్యాబ్‌లు, క్రీడా మైదానాలతో విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. తక్కువ ఫీజు, హస్టల్ వసతి అంటూ గాలం వేస్తున్నాయి.

అందరికీ సీటు వస్తుంది..

రాష్ట్రంలో ఇంజనీరింగ్ బోలెడన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి పేర్కొంటోంది. సీట్ల కోసం డొనేషన్ కట్టి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రైవేటు కాలేజీల్లో బీ–క్యాటగిరీ సీట్ల భర్తీకి ప్రభుత్వం ఇంకా అనుమతించలేదని, నిబంధనలకు వ్యతిరేకంగా ముందే భర్తీ చేస్తే చర్యలు తప్పవని కాలేజీల యాజమాన్యాలను హెచ్చరిస్తోంది. అనుమతి లేని కాలేజీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తోంది. హైదరాబాద్ నానక్‌రాంగూడ , మాదాపూర్,హైటెక్ తదితర ప్రాంతాల్లోని పలు ఇంజనీరంగ్ సంస్థలకు ఏఐసీటీఈ గుర్తింపు లేదని స్పష్టం చేసింది.